# పిరికి దయ్యం

నిశిరాత్రి. పూర్ణచంద్రుడు నడినెత్తిన వెలుగుతున్నాడు. స్మశానం నిర్మానుష్యంగా ఉందిగాని నిశ్శబ్దంగా లేదు. కీచురాళ్ళు నలుదిక్కులనుంచీ గీపెడుతున్నాయి. ఒక నల్లకుక్క వెచ్చని చోటుగా చూసి చుట్ట చుట్టుకు పడుకుని మధ్య మధ్య తలఎత్తి చంద్రుడికేసి మోరచాచి ఏడుస్తోంది. చెట్లమీద నిద్రపోయే పక్షులు మధ్య మధ్య కదలి రెక్కలు టపటపలాడించి మళ్ళీ జోగుతున్నాయి.

కాని స్మశానంలో అసలు సందడి ఇది కానే కాదు. నిజమైన కోలాహలం వేరే ఉంది. ఆ స్మశానంలో నూరు, నూటయాభైమంది విగత ప్రాణులు సమావేశమైనారు. చిన్నవీ, పెద్దవీ, ఆడవీ, మగవీ అయిన దయ్యాలూ, భూతాలూ, ప్రేతాలూ, పిశాచాలూ చేరి ఎంతో ఉత్సాహంతో ప్రాణులకు సాధ్యంగాని చైతన్యంతో సందడి చేస్తున్నారు.

స్మశానంలో ఉన్న రావి, మర్రి వగైరా చెట్ల ఆకుసందుల నుంచి ఊడల్లాగా జారే చంద్రకిరణాలను పట్టుకుని కోతులకన్న వేగంగా పైకిపాకి, సర్రునజారుతూ, కేకలు పెడుతూ దయ్యపిల్లలు చెప్పరాని అల్లరి చేస్తున్నాయి. వాటికి పెద్దల భయంలేదు.

యువక దయ్యాలు ఒకదాన్ని ఒకటి తరుముతూ గోరీలమీదుగానూ గోతులమీదుగానూ ఎగురుతూ పాటలు పాడుతూ, మధ్య మధ్య భూమిలోదూరి ఒకదాని వెంట పడకుండా ఒకటి దాక్కుంటూ, నిర్భయంగా అశ్లీల సంభాషణలు చేస్తూ వాటి మానాన అవి కాలం వెళ్ళబుచ్చుతున్నాయి.

వయసు మళ్ళిన దయ్యాలు గుంపులు గుంపులుగా చేరి స్మశానం ఒక మూల నుంచి మరొక మూలకు పచార్లు చేస్తూ, మధ్య మధ్య దయ్యాలనూ, యువక దయ్యాలనూ ప్రోత్సహిస్తూ బాతాఖానీ కొడుతున్నాయి.

ఈ సందట్లో, తనకెవరి గొడవా పట్టనట్టుగా, ఒక యువక దయ్యం మర్రిచెట్టు ఊడల మధ్య ఒక రాతిమీద రోడిన్‌చెక్కిన "థింకర్" పోజులో కూర్చుని తదేక ధ్యానంగా ఆలోచిస్తున్నది.

"ఏమిటా దీర్ఘాలోచన?"

"థింకరు" దయ్యం తలయెత్తి చూసింది. దానికెదురుగా ఒక వృద్ధ దయ్యం నిలబడి ఉంది.

"నా గొడవ ఎందుకులే తాతా? ఆర్చేదా, తీర్చేదా?" అన్నది యువకదయ్యం.

"అయితే తప్పకుండా అటువంటి గొడవ అందరితోటీ పంచుకోవాలి" అన్నది ముసలి దయ్యం పక్కనే నేలమీద కూర్చుంటూ.

యువకదయ్యం సంభాషణలోకి దిగేటట్టు కనిపించలేదు.

"అబ్బాయీ, మనకు విచారం తగదు. యమధర్మరాజు ధర్మమా అంటూ మనం విచారాన్ని జయించాం. మనకిప్పుడు అవసరాలులేవు, సంఘంలేదు, సమస్యలు లేవు. మేధస్సు యొక్క ఇరుకు సందుల్లోనుంచీ, నియమాల నిర్బంధంనుంచీ బయటపడ్డ భావాలం మనం. విశ్వమంతా మనదే. దేనికి నీకీ విచారం. తుచ్ఛమైన ఈ నరవాసన నీకు తగదు" అని హెచ్చరించింది ముసలిదయ్యం.

"విచారం తప్ప నా జీవితానికింకేమీ లేదు. నేను భయంతో తీసుకుంటున్నాను. ఈ వ్యాధి ఎప్పటికి కుదురుతుందో తెలియదు" అన్నది యువకదయ్యం. అది మాట్లాడే ధోరణిలో పడిందని గ్రహించి వృద్ధ దయ్యం అడ్డురాలేదు.

"ఒకప్పుడు నాకు చింతలేదు, భయంలేదు" అని చెప్పుకుపోసాగింది యువకదయ్యం.

"మేమొక పూరిగుడిసెలో వుండేవాళ్ళం. మా అమ్మ కూలిచేసేది, మా అయ్య కూలిచేసేవాడు. నేను కొన్నాళ్ళు గొడ్లకాశాను. చీకూ చింతా ఉండేదికాదు. ఎవరినడుక్కున్నా ఇంత తినటానికి దొరికేది. ఎవరో ఒకరు పాతచొక్కా ఇచ్చేవాళ్ళు. ఇంకేం కావాలి?

"కొన్నాళ్ళకి మా అయ్య మంచాన పడ్డాడు. మా అమ్మా, నేనూ మా అయ్యకు చేశాం. శానా రోజులు తీసుకు చచ్చాడు. ఏడిచాం. కాని విచారంలేదు. చావక తప్పుతుందా? రోగాలు రావా! అందరూ చచ్చేవాళ్ళే, రాసి పెట్టుకున్నది జరక్కమానుతుందా? రాసిపెట్టుండటం కాకపోతే, కొందరికి మిద్దిలేం? కొందరికి గుడిసెలేం? కొందరు నీకు మల్లే నూరేళ్ళు బతకటమేం, కొందరు నాకు మల్లే ఇరవైయేళ్ళకే చావటమేం?

"అయ్య పోయాక సంసారం ఇరకాటమయింది. మా అమ్మ నన్ను పాలికి పెట్టింది. కష్టమైన పనే. అయితే ఏం? చెయ్యాల్సిందే. ఇంతలో మా అమ్మకి కాళ్ళు చేతులు పడ్డయి. అడిగావూ నా పాట్లు? వారూ వీరూ ఆదుకున్నారు. ప్రపంచంలో నాకు కావలసిన మనుషులున్నారని తెలిసింది. ఆనందమయింది. కష్టమే, కాని విచారం లేదు, భయం అంతకన్నా లేదు.

"మా అమ్మా చచ్చింది. ఖామందుల ఇంట్లోనే వుంటూ చాకిరీ చేశాను. ఒళ్ళు విరిగేట్టు చాకిరీ చెయ్యటం, వొళ్ళు తెలీకుండా నిద్రపోవటం. ఎంత సుఖంగా ఉండేవి రోజులు!

"ఓ రోజు మా గ్రామానికో పంతులొచ్చాడు. ఊళ్లో మీటింగు చేశారు. మనకి

స్వరాజ్యం లేదన్నాడు పంతులు. తెల్లవాళ్ళు దేశాన్ని కొల్లగొడుతున్నారు, అందుకనే మన దేశంలో ఈ దారిద్ర్యం, మనం స్వరాజ్యం తెచ్చుకుంటే అన్ని కష్టాలూ పోతయి, అందరూ చదువుకుంటారు. అందరూ డబ్బు సంపాదించుకుంటారు. అంతా సుఖంగా ఉంటారన్నాడు పంతులు. పంతులు మాటలు వింటుంటే నాకు విచారం కలగసాగింది – మా అయ్యపోయినా, అమ్మపోయినా కలగని విచారం. స్వరాజ్యం ఎట్లా తీసుకురావటం?

"సత్యాగ్రహమన్నారు. మా ఊళ్లో గొప్పవాళ్ళే జెయిలుకు పోయినారు. వాళ్ళు వచ్చేటప్పుడు స్వరాజ్యం తెస్తారని చెప్పారు. వాళ్ళు తిరిగొచ్చారు. స్వరాజ్యం ఇంకా రాలేదన్నారు. పాపం, అయ్యగార్లు బక్కచిక్కి ఖాయిలాపడి ఇళ్ళకొచ్చారు. అందరూ ముతక గుడ్డలు కట్టారు. నేనూ కట్టా, మా అయ్యగారు చించి పారేసినది.

"నాలో ఏదో పురుగు పుట్టింది. విచారం నా నాటికీ ఎక్కువవుతున్నది. తగ్గటం లేదు. అందరూ అనేదల్లా వింటున్నా – వినకుండా వున్నా బాగుండేదేమో! ఓ చౌదరమ్మ చెప్పాడు, ఓ కళ్ళజోడాయన చెప్పాడు, ఓ ఎర్రబట్టలాయన చెప్పాడు, ఓ పంచదార మాత్తర్ల మనిషి చెప్పాడు. అందరు చెప్పిందీ విన్నా.

"ఒక్కొక్కటే తెలుస్తున్నది. బాపనయ్యలు ఎక్కువ వాళ్ళమని నాలాటివాళ్ళని తొక్కేశారు. మంచి మంచి పనులు, శానా డబ్బులొచ్చే పనులు, గొప్ప పనులు బాపనయ్యలు చేసి నా బోటి వాళ్ళచేత గొడ్లు కాపిస్తారు, కమతం చేపిస్తారు. వారిని నేను ఏమండీ అని మర్యాదగా పిలిస్తే, వారు నన్ను ఏంరా అని కసురుగా పిలుస్తారు. నేను చేసే చాకిరీతో వారు వైభవంగా నన్ను నీచంగా బతకనిస్తారు. బాపనయ్యల గొప్ప పోగొడితే నేనూ చదువుకోవచ్చు. నాకూ పొలాలుంటయి. నేనూ పెద్ద ఉద్యోగాలు చేస్తా –

"అసలీ హిందూమతంలోనే వుంది ఈ జబ్బు. కిరస్తానులంతా ఒక్కటే. వాళ్ళలో ఎక్కువా తక్కువా లేదు. కిరస్తానీ బాపనయ్యల పిల్లల్ని కిరస్తానీ మాలాడు పెళ్ళి చేసుకోవచ్చు.

"మా అయ్యా, అమ్మా కాలం మూడి చావలేదు. తిండిలేక చచ్చారు. అటువంటి రోగాలు గొప్పవాళ్ళంతా నయం చేసుకుంటూనే ఉన్నారు. మందుల వైద్యం, మాయదారి వైద్యం, పంచదార మాత్తర్లిస్తే అన్ని రోగాలు నయమవుతయి. మందు నీళ్ళు లేని రోగాలు తెచ్చిపెడతాయి. ఇంజెక్షన్లిచ్చి డాక్టర్లు కొంపదివాలా తీస్తారు. పెద్దవాళ్ళు కూడా పంచదార మాత్తర్లతో చవకగా రోగాలు నయం చేసుకోవచ్చు.

"ఇదంతా తెలుసుకుంటున్న కొద్దీ నాకు విచారం ఎక్కువవుతున్నది. నా జీవితం ఎంత బాగుపడటానికి వీలుందో తెలిసినకొద్దీ ఆ జీవితం మీద అసహ్యం జాస్తవుతున్నది. ఇంతలో నా పాలిటికి కళ్ళజోడాయన దాపరించాడు. మనిషిని కుంగదీస్తున్నది కులాలు కాదన్నాడు, డబ్బన్నాడు. డబ్బున్న బాపనాడైనా, కోమటైనా, శూద్రరాడయినా డబ్బు

లేనివాళ్ళకి దూరమేనన్నాడు. పేదల బతుకంతా దోపిడేనన్నాడు. స్వరాజ్యం వచ్చింది, మీ బతుకు లేమయినయన్నాడు. విప్లవం జరగాలన్నాడు.

"విప్లవమంటే డబ్బులు కలవాళ్ళూ లేనివాళ్ళూ ఒకరిగొంతులు ఒకరు కోసుకోవటం. నేనా కళ్ళజోడాయనతో చాటుగా మాట్లాడాను. డబ్బున్న వాళ్ళల్లో మంచివాళ్ళు లేరా అని అడిగాను. ఉన్నారన్నాడు. వాళ్ళ పెళ్ళాల దగ్గిరా, పిల్లల దగ్గిరా, బంధువుల దగ్గిరా వాళ్ళు మంచి వాళ్లేనన్నాడు. తక్కువ వర్గాల దగ్గరవాళ్ళు హంతకులేనన్నాడు. మంచిగా వుండాలని వాళ్ళు ప్రయత్నించినా వాళ్ళ ప్రయత్నాలు సాగవన్నాడు.

"కళ్ళజోడాయన మాటలు వింటుంటే ప్రపంచమంతా పాపంతో, అన్యాయంతో నిండిందని తెలిసింది. నాబోటి వాడికి జీవితంలో సుఖంగా ఉండేందుకు అధికారం లేదని తెలిసింది. కాలికింద నల్లికెంత స్వేచ్ఛ వుందో నాకూ అంతే స్వేచ్ఛ వుందని తెలిసింది. కళ్ళజోడాయన మాటలు త్వరలోనే నిజమయాయి. మా వూళ్లో రైతు కూలీలు సమ్మెసాగించారు. పోలీసులొచ్చారు. తుపాకులు తీసి పిచ్చి కుక్కల్ని కాల్చినట్టు కాల్చారు. మా వూరు మోతుబరి, గాంధీ భక్తుడు, రెండొందల ఎకరాల అసామీ పిలిపించాడు పోలీసుల్ని. నేను ఏ సమ్మె చేయలేదు. నాకు భయం. కాని గుండుదెబ్బ నాకూ తగిలింది. బయటపడ్డాను. కాని నా విచారం నన్ను వదల్లేదు.

"నేనెందుకు పిరికి వాణ్ణయినాను? హాయిగా బతకాలనే కలలుకన్నానుకాని నలుగురితో చేరి హాయిగా బతకటానికి చేయాల్సిందేదో ఎందుకు చేయలేదు? ఇదే నన్ను పీడించుకుతింటున్నది. ఒక్కోసారి, ఏ గుడ్డివాడుగానో చెవిటి వాడుగానో ఎందుకు పుట్టలేదా, అట్టా అయినా బతికిన నాలుగునాళ్ళూ సుఖంగా బతికేవాణ్ణి అనిపిస్తుంది." ముసలిదయ్యం యువక దయ్యంకేసి ఆశ్చర్యంగా చూసింది – ఈ యువకుడికి నరవాసన పోక పోవటం ముసలి దయ్యానికర్థం కాలేదు –

ఇంతలోనే విచిత్రంగా యువకదయ్యం అదృశ్యం కాసాగింది –

ముసలి దయ్యానికి రహస్యం బోధపడింది – యువకుడి కింకా జీవితంలో ఋణం తీరిపోలేదు. మళ్ళీ వెనక్కుపోయినాడు, అని ముసలిదయ్యం గ్రహించింది –

***మొదటి ముద్రణ: ఆనందవాణి, 31 ఆగస్ట్ 1947***